సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం | 18 | ఆగస్టు | 2024



జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళిక

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికను రూపొందించుకుని, వాటి లక్ష్యాలను సాధించడానికి చర్యలు తీసుకోవాలని జేసీ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. -8లో



తుది దశకు అండర్-19 టోర్నీ

కడపలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ చివరి దశకు చేరుకుంది. శనివారం మ్యాచ్‌లో కడప, విశాఖపట్నం జట్లు తలపడ్డాయి. -8లో

గరిష్టం/కనిష్టం
37.8/26.2

వాతావరణం

జిల్లాలో శనివారం 26.2 - 37.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

19న వరల్డ్ ఫొటోగ్రఫీ డే వేడుకలు

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు వరల్డ్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఫొటోగ్రఫీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సంపత్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ వైయస్ఆర్ ఏఎఫ్ఏయూ ఇంచార్జి వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథ కుమార్, ఇంచార్జి రిజిస్ట్రార్ ఎన్ రాజేష్ కుమార్ రెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కడప నగర ప్రజలు ఈ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్‌ను సందర్శించాలని కోరారు.

4 నుంచి ఉచిత శిక్షణ తరగతులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు సెప్టెంబరు 4వ తేది నుంచి టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి ఆరీఫ్ తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు మహిళలు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల వారికి ప్రాధాన్యత ఇస్తారన్నారు. దూర ప్రాంతాల వారికి శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జెడ్పీలో సాధారణ బదిలీలకు అనుమతి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా ప్రజాపరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం జీఓ నెం. 75 ద్వారా అనుమతి ఇచ్చిందని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి 31వ తేది లోపు సాధారణ బదిలీలు ఉంటాయని పేర్కొన్నారు. అర్హులైన ఎంపీడీఓలు, మినిస్టీరియల్, నాల్గవ తరగతి సిబ్బంది, ఐదు సంవత్సరాలు పూర్తయిన వారు, రిక్వెస్ట్ బదిలీ దరఖాస్తు ఫారాలను సంబంధిత అధికారుల అనుమతితో జిల్లా పరిషత్‌లో ఈనెల 25వ తేది సాయంత్రం 5.00 గంటల్లోపు సమర్పించాలని సూచించారు. ఐదు సంవత్సరాలు సర్వీసు ఒకేచోట పూర్తయిన వారిని తప్పనిసరిగా బదిలీ చేస్తామని వివరించారు. ఏదైనా అభ్యర్థన, అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద బదిలీ కోరేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. క్రమశిక్షణాచర్యలుగానీ, శాఖాపరమైన చర్యలుగానీ ఉన్న వారు బదిలీకి అనర్హులని స్పష్టం చేశారు. సాధారణ బదిలీలపై సెప్టెంబరు 1 నుంచి నిషేధం అమలులోకి వస్తుందని తెలిపారు.

ముగిసిన కౌన్సెలింగ్




స్టాఫ్ నర్సులుగా నియామక పత్రాలను అందజేస్తున్న ఆర్డీ డాక్టర్ శ్రీనివాసులు

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో నిర్వహించిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకాల ప్రక్రియ ముగిసింది. మొత్తం 206 పోస్టులకుగాను రోజుకు 50 మంది చొప్పున కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ మేరకు శనివారం చివరి విడతగా 52 మందికి కౌన్సెలింగ్ నిర్వహించగా, 43 మంది హాజరై నియామక పత్రాలను స్వీకరించారు. అనంతరం ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ వై.శ్రీనివాసులు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం స్టాఫ్ నర్సు నియామకాలను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్త వత్సలం, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు అతావుల్లా, బత్తనయ్య తదితరులు పాల్గొన్నారు.

గుట్టకాయ స్వాహా!

'పచ్చ'రాజ్యంలో ప్రకృతి వనరులు ధ్వంసమవుతున్నాయి. టీడీపీ నేతల కోరల్లో చిక్కి గుట్టలు గుల్లవుతున్నాయి. చెట్టూ..చేమా..కొండా కోనా నిలువునా కరిగిపోతున్నాయి. కడపలో గ్రావెల్ మాఫియా రాజ్యమేలుతోంది. నిత్యం గ్రావెల్‌ను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతోంది. అక్రమార్జనే ధ్యేయంగా.. ఆకాశమే హద్దుగా అక్రమ రవాణాతో చెలరేగుతోంది.



కొలుములపల్లె పిచ్చమ్మ గుట్టపై గ్రావెల్ లోడింగ్ చేస్తున్న దృశ్యం

- చింతకొమ్మదిన్నె మండలంలో గుట్టలు గుల్ల
- టిప్పర్ల ద్వారా నిరంతరం తరలింపు
- 5 లీజుల పరిధిలో డిమాండ్ ఉన్న గ్రావెల్ అంతా కొలుములపల్లె నుంచే...
- టీడీపీ నేతల కనుసన్నల్లోనే అక్రమ మైనింగ్
- ఫిర్యాదులున్నా కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం

సాక్షి ప్రతినిధి, కడప: అక్రమ మైనింగ్‌దారులు చెలరేగిపోతున్నారు. చింతకొమ్మదిన్నె మండలం నుంచి అక్రమంగా కడపకు గ్రావెల్ తరలిస్తున్నారు. నిత్యం వందలాది టిప్పర్లతో గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఏకంగా మూడు మిషన్లతో గ్రావెల్ లోడింగ్ చేస్తున్నారు. ఫలితంగా లక్షలాది రూపాయలు రాయల్టీ రూపేనా లభించాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. ఇదంతా బహిర్గతంగా జరుగుతున్నా అధికార యంత్రాంగం తేలుకుట్టిన దొంగలా చూస్తోంది.

● కడప చుట్టుపక్కల ప్రాంతాల్లో అధికారికంగా 5గ్రావెల్ మైనింగ్ లీజులున్నాయి. వాటి పరిధిలో ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించి గ్రావెల్ తరలించేవారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అధికారిక మైనింగ్ లీజుదారులకు రాయల్టీ అనుమతులు ఇవ్వలేదు. ఇదే ఆసరాగా తీసుకుని తెలుగుదేశం నాయకులు అక్రమంగా మైనింగ్ చేస్తున్నారు. తద్వారా కోట్లాది రూపాయాలు ఆర్జిస్తున్నారు. ఈక్రమంలో చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లె గ్రామం సమీపంలోని పిచ్చమ్మ గుట్టను గుల్ల చేస్తున్నారు. 3 మిషన్లు పెట్టి టిప్పర్లకు లోడింగ్ చేస్తున్నారు. వందలాది ట్రిప్పులు యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తున్నా, అధికారులు అటువైపు కన్నెత్తి చూసే సాహసం చేయలేకున్నారు.

నెలరోజులుగా రవాణా

చింతకొమ్మదిన్నె చెరువులో తొలుత గ్రావెల్ మట్టి అక్రమంగా తరలించే చర్యలకు పాల్పడ్డ పచ్చ నేతలు, తర్వాత కొలుములపల్లె పిచ్చమ్మ గుట్ట కేంద్రంగా అక్రమంగా మైనింగ్ కొనసాగిస్తున్నారు. తొలి రోజుల్లో నిత్యం రెండు వందల ట్రిప్పులు గ్రావెల్ కడప చుట్టుపక్కల ప్రాంతాలకు తరలివెళ్లేది. టిప్పర్ రూ.4500తో కడపకు యథేచ్ఛగా తరలించారు. టిప్పర్ బాడుగ, మిషన్ లోడింగ్ రూ.2వేలు ఖర్చు మినహాయిస్తే టిప్పర్‌కు రూ.2500 ఆదాయాన్ని తెలుగుతమ్ముళ్లు ఆర్జిస్తున్నారు. అంటే రోజుకు రూ.5లక్షలు చొప్పున అక్రమ ఆదాయాన్ని గడిస్తున్నారు. ఇంత యథేచ్ఛగా అక్రమ మైనింగ్ చేస్తున్నా జిల్లా కేంద్రంలో అధికార యంత్రాంగం మొత్తం తిష్టవేసి ఉన్నా, అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ స్థాయి వరకూ ఎవ్వరూ కూడా కన్నెత్తి చూడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



లోడింగ్ అనంతరం గ్రావెల్‌తో కడపకు వస్తున్న టిప్పర్

కోల్డ్‌వార్‌తో నెమ్మదించిన దూకుడు

టీడీపీ నేతల మధ్య నెలకొన్న కోల్డ్‌వార్ కారణంగా అక్రమ మైనింగ్ దూకుడుకు ఇటీవల కాస్త బ్రేకులు పడ్డాయి. నిత్యం రూ.5లక్షలు కడప కేంద్రంగా గ్రావెల్ మైనింగ్ ద్వారా సంపాదిస్తున్నారనే విషయం తెలుసుకున్న అధికార పార్టీలో మరోవర్గం అక్రమ ఆదాయానికి గండికొట్టే ఎత్తుగడను ఎంచుకున్నారు. కడప కార్పొరేషన్ పరిధిలో వెంచర్లల్లో ఎక్కడా కూడా రోడ్డు ఫార్మేషన్ పనులు చేయరాదని రియల్టర్లను కార్పొరేషన్ అధికారులు అనధికారికంగా హెచ్చరికలు జారీ చేశారు. ఆపై వార్డు సచివాలయ సిబ్బంది స్వయంగా పర్యవేక్షణ చేస్తున్నారు. దాంతో 200 ట్రిప్పుల స్థానంలో ప్రస్తుతం సగానికి మాత్రమే పరిమితం అయినట్లు సమాచారం .కట్టడి చేయాల్సిన మైనింగ్ అధికారులు అధికార మత్తులో జోగుతుంటే, తెలుగుతమ్ముళ్ల మధ్య నడుస్తున్న కోల్డ్‌వార్ కారణంగా మరో విధంగా కార్పొరేషన్ యంత్రాంగం ద్వారా కట్టడి చేసే ప్రయత్నాలు తెరపైకి వచ్చాయి. అంతే తప్పా అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి డీడీ రవిప్రసాద్‌ను వివరణ కోరగా అక్రమ మైనింగ్ వ్యవహారం తన దృష్టికి రాలేదని తెలిపారు. ఫుల్ అడిషనల్ ఛార్జీలో ఉన్నానని, మైనింగ్ యంత్రాంగాన్ని పంపించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



గ్రావెల్ లోడింగ్ కోసం వెళ్తున్న టిప్పర్లు

గండిక్షేత్రం.. భక్తజనసంద్రం



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయుడు



అంజన్న దర్శనం కోసం క్యూ లైన్లలో భక్తుల ఎదురు చూపు

చక్రాయపేట: శ్రావణమాసం రెండో శనివారోత్సవం సందర్భంగా గండి క్షేత్రం భక్తజనంతో నిండిపోయింది. ఆలయ ప్రధాన,ఉప ప్రధాన,ముఖ్య అర్చకులు కేసరి,రాజారమేష్, రాజగోపాలాచార్యులు అర్చకులు రఘు,సాయిలు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.పూజలు నిర్వహించారు.పలువురుభక్తులు అన్నదానం నిర్వహించి తమ మొక్కు చెల్లించుకున్నారు. కడప సర్వజన ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. చక్రాయపేట ప్రభుత్వ వైద్యశాల తరపున డాక్టర్ స్వర్ణలత వైద్యశిబిరం నిర్వహించి అస్వస్థతకు గురైన వారికి చికిత్స అందించారు. ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ,మాజీ చైర్మన్ వెంకటస్వామి పాలక మండలి సభ్యులు ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. రెండో శనివారం సుమారు 40 వేల మంది వరకు భక్తులు స్వామిని దర్శించుకుని ఉంటారని ఆలయ వర్గాల అంచనా. పులివెందుల ఆర్కేవ్యాలీ ఎస్సై రంగారావు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాగా తలనీలాల కట్ట వద్ద క్యూలైన్‌లు సరిపడక భక్తులు ఎండలో నిలబడ్డారు.

బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యం

- జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు
- కేసుల పురోగతి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలి
- కోర్ట్ మానిటరింగ్ సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్ల సమీక్షా సమావేశంలో ఎస్పీ దిశానిర్దేశం



కోర్టు మానిటరింగ్ సెల్ అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్: సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరిచి బాధితులకు న్యాయం జరిగేలా సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి నిందితులకు శిక్షపడేలా కృషి చేయాలని ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు కోర్ట్ మానిటరింగ్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. శనివారం స్థానిక 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్'లో జిల్లాలోని కోర్టు మానిటింగ్ సిబ్బంది, పోలీస్‌స్టేషన్‌లకు చెందిన కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల పురోగతిని ఎప్పటికపుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించా లని ఆదేశించారు. అన్ని ట్రయల్ కేసుల్లో సత్వర, సక్రమ విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నా రు. అన్ని ట్రయల్ కేసుల్లో సత్వర, సక్రమ విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కోర్టులలో ఛార్జ్‌షీట్ ఫైల్ చేసిన అనంతరం కోర్టు ద్వారా సంబంధిత కేసులలో సి.సి నెంబర్లను తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు పెండింగ్ సమన్లు జారీ అయ్యేలా, వారెంట్లు అమలు జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నూతనంగా అమల్లోకొచ్చిన, బి.ఎన్.ఎస్.ఎస్ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కొత్త చట్టం మేరకు కోర్టు ప్రొసీడింగ్స్ జరిగేలా చూడాలని ఎస్పీ ఆదేశించారు. ప్రతి కోర్టు కానిస్టేబుల్ విధిగా తన పరిధిలోని ప్రతి కేసు గురించి అవగాహన పెంచు కుని సరైన సాక్ష్యాధారాలతో నిందితులకు శిక్షపడే లా చూడాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌ఛార్జ్ ఇన్స్‌పెక్టర్ ఎస్. వినయ్ కుమార్ రెడ్డి, డి.సి.ఆర్.బి సీఐలు డి. భాస్కర్‌రెడ్డి, సయ్యద్ హాసం, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కోర్టు భవనాన్ని పరిశీలించిన జిల్లా జడ్జి

కమలాపురం: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు భవనాన్ని జిల్లా జడ్జి శ్రీదేవి పరిశీలించారు. బ్రిటీష్ హయాంలో నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతుండటంతో అదే భవనం స్థానంలో నూతన భవనం నిర్మించే క్రమంలో ఆమె శనివారం పరిశీలించారు. కోర్టు పరిసరాలు, నూతన భవన నిర్మాణం తదితర విషయాలను న్యాయవాదులు, ఆర్‌అండ్‌బీ ఇంజినీరు కల్యాణి తదితరులతో ఆమె ఆరా తీశారు. కోర్టు భవనం నిర్మించే వరకు ఎదురుగా నూతనంగా నిర్మించి ఉన్న ఎస్‌టీఓ కార్యాలయాన్ని వినియోగించుకుంటే బాగుంటుందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే ఆ భవనాన్ని సైతం ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుష్పరాజు, న్యాయవాదులు గురువయ్య, మహేశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డి, నాగభూషణరెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.



న్యాయవాదులతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీదేవి

జిల్లా అదనపు ఎస్పీ లోసారి సుధాకర్ బదిలీ



కడప అర్బన్: జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా పనిచేస్తున్న లోసారి సుధాకర్‌ను ఏసీబీ అదనపు ఎస్పీగా హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఈనెల 16న ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 49 మంది అదనపు ఎస్పీలను బదిలీ చేసిన విషయం తెలిసిందే. కాగా సుధాకర్ జిల్లాలో ఎస్ఐగా, సీఐగా, డీఎస్పీగా పనిచేశారు. ఎన్నికల ముందు జనవరిలో జిల్లా అదనపు ఎస్పీగా నియమితులై సమర్థవంతంగా విధులను నిర్వర్తించారు.

ట్రిపుల్ ఐటీలో వికలాంగుల కోటా కింద సీట్ల భర్తీ

అడ్మిషన్ కన్వీనర్ అమరేంద్ర కుమార్ నంద్ర

వేంపల్లె: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు 2024-25 విద్యా సంవత్సరం సంబంధించి వికలాంగుల కోటా కింద 141 సీట్లు భర్తీ చేయనున్నట్లు అడ్మిషన్ కన్వీనర్ అమరేంద్ర కుమార్ నంద్ర పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగు ట్రిపుల్ ఐటీలకు వికలాంగుల కోటా కింద 200 సీట్లు ఉండగా..255 మంది దరఖాస్తు చేసుకున్నారు. 141 మందికి అధికారులు కాల్ లెటర్స్ పంపారన్నారు. అందులో 112 మంది దొంగ సర్టిఫికెట్లను తీసుకొచ్చి దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. 90 శాతం మంది చెవుడు కింద దరఖాస్తు చేసుకోగా ట్రిపుల్ ఐటీ అధికారులకు అనుమానం వచ్చి విజయవాడ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులకు పంపగా 112 మంది విద్యార్థులవి నకిలీ సర్టిఫికెట్లు అని తేలాయి. దీంతో వారి సీట్లను రద్దు చేసినట్లు తెలిపారు. వికలాంగుల కోటా కింద మిగిలిన 59 సీట్లను త్వరలో మూడో విడత జనరల్ కోటాలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వీరికి ఈ నెల 20 తేదీన కౌన్సెలింగ్ ప్రక్రియ జరపనున్నామని తెలిపారు. కాల్ లెటర్స్ పంపిన విద్యార్థులకు ఆయా క్యాంపస్లలో 20 తేదీన 8 గంటలకు తప్పక హాజరుకావాలని కోరారు.

వైద్యుల కన్నెర్ర



ప్రొద్దుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

కోల్‌కత్తాలో మహిళా వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన దోషుల్ని నడిరోడ్డుపై ఉరి తీయాలని వైద్యులు డిమాండ్ చేశారు. ఈ అమానుష ఘటనపై వైద్యలోకం కన్నెర్ర చేసింది. జిల్లా వ్యాప్తంగా వైద్యులు రోడ్లపైకొచ్చి నిరసన తెలిపారు.. ఎక్కికక్కడ కదిలొచ్చి ర్యాలీలు చేశారు. కడప రిమ్స్‌లో జూనియర్ డాక్టర్లు కళాశాల ఆవరణలోనే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. నల్లబ్యాడ్జీలను ధరించి ఓపీ విధులకు గైర్హాజరయ్యారు. ఇక ప్రొద్దుటూరు తదితర చోట్ల పెద్ద ఎత్తున ప్లకార్డులతో.. బ్యానర్లతో నిరసన ర్యాలీలు చేశారు. దేశంలో శాంతిభద్రతలు దారుణంగా ఉన్నాయని ధ్వజమెత్తారు. దోషుల్ని కఠినంగా శిక్షించాలని.. వైద్యులకు సరైన రక్షణ కల్పించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

-సాక్షి, నెట్‌వర్క్



రిమ్స్ ఆవరణలో జరుగుతున్న ఆందోళనలో పాల్గొన్న పీజీలు, వైద్య విద్యార్థులు

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మృతుడు మణికుమార్

వల్లూరు : మండల పరిధిలోని పెద్ద లేబాక అరుంధతీవాడకు చెందిన చిన్న గురివిగాండ్ల మణికుమార్ (24) అనే యువకుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతడు శనివారం తెల్లవారుజామున గుండెల్లో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో వారు అతన్ని చికిత్స కోసం కమలాపురం క్రాస్ రోడ్డులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించే క్రమంలో నోటి నుంచి నురగ వస్తూ పరిస్థితి విషమించింది. దీంతో మెరుగైన వైద్యం కోసం కమలాపురం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

లారీ, జేసీబీ సీజ్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని రామాంజనేయపురం గ్రామ సమీపంలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తుండగా లారీ, జేసీబీలను సీజ్ చేసినట్లు ఎర్రగుంట్ల పట్టణ సీఐ నరేష్‌బాబు తెలిపారు. రామాంజనేయపురం గ్రామంలోని పెన్నానదిలో జేసీబీని ఉంచి అక్కడి నుంచి లారీలలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా దాడి చేశామన్నారు. ఈ దాడిలో అక్కడ ఉన్న జేసీబీ, లారీతో పాటు ఐదుగురిని అరెస్టు చేసి వారిపై కేసును నమోదు చేశామన్నారు.

విద్యుత్ సిబ్బందిపై ఎస్ఐ దాడి


ఎస్ఐ దాడిలో గాయపడిన జేఎల్ఎం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని పూలఅంగళ్ల సర్కిల్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో విద్యుత్ జేఎల్ఎంలుగా పనిచేస్తున్న గురురాజ్, మహమ్మద్ షఫీలపై ఎస్ఐ అనిల్ దాడి చేశాడు. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అర్ధరాత్రి సమయంలో జయమ్మకాలనీ, ఆటోనగర్ కాలనీలలో విద్యుత్ ఫ్యూజులు వేసి వస్తుండగా పూలఅంగళ్ల వద్ద ఎస్ఐ అనిల్ వాహనాన్ని ఆపి ఈ సమయంలో ఎక్కడి నుంచి వస్తున్నారు అంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడి చేశారు. ఈ సంఘటనపై తోటి ఉద్యోగులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఎస్ఐ అనిల్‌ను వీఆర్‌కు పంపినట్లు సమాచారం.

బీఎస్ఎన్ఎల్ సేవ.. మరింత చేరువ

4జీ నెట్‌వర్క్‌తో ప్రజలకు చేరువవుతున్న భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్



కడపలోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సేవా కేంద్రం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) సరికొత్త టెక్నాలజీతో వినియోగదారులకు చేరువ అవుతోంది. టెలికాం రంగంలో ఎన్నో ప్రైవేట్ సంస్థలు వచ్చినా.. బీఎస్ఎన్ఎల్‌ను మాత్రం వినియోగదారులు సొంత సంస్థగా భావిస్తుంటారు. ప్రైవేట్ టెలికాం సంస్థలు మారుమూల గ్రామాలకు సేవలను విస్తరించలేకపోతున్నాయి. అదే తరుణంలో బీఎస్ఎన్ఎల్ ప్రతి ప్రాంతానికి చేరువ అవడంతో సంస్థ మనుగడ సాగిస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని సంస్థ సైతం సాంకేతిక టెక్నాలజీ వైపు ముందడుగు వేసి 4జీ బీఎస్ఎన్ఎల్ నెట్ వర్క్‌ను ప్రజలకు త్వరలో అందించనుంది. దీంతో పాటు మై బీఎస్ఎన్ఎల్ యాప్ ద్వారా వినియోగారులకు కావాల్సిన సేవలను అందిస్తోంది.

త్వరలో బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్ సేవలు..



జిల్లాలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు 4జీ సేవలను అందించేందుకు భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్ టవర్లను ఏర్పాటు చేసి ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంచారు. బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డుల కోసం, ఇతర కంపెనీల సిమ్‌ల నుంచి పోర్ట్‌కు మారేందుకు ప్రజలు బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు.

మై బీఎస్ఎన్ఎల్ యాప్‌తో విశిష్ట సేవలు..

ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ మై బీఎస్ఎన్ఎల్ యాప్‌తో ప్రజలకు విశిష్ట సేవలను అందిస్తోంది. వాటిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సైతం విస్తృత ప్రచారాలు నిర్వహించారు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

గూగుల్ ప్లే స్టోర్‌లో మై బీఎస్ఎన్ఎల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ తర్వాత ఈ-మెయిల్ ఐడీ లేదా రిజిస్టర్ మొబైల్ నంబర్‌తో యూజర్ నేమ్, పాస్ వర్డ్‌ను క్రియేట్ చేసుకోవాలి. అనంతరం మన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ఎంటర్ చేస్తే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది.

యాప్ ద్వారా పొందే సేవలు..

బిల్ పేమెంట్ : ఒకప్పుడు బీఎస్ఎన్ఎల్ బిల్లులు చెల్లించాలంటే క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి. ఇప్పుడు బీఎస్ఎన్ఎల్‌కు చెందిన ల్యాండ్ ఫోన్, మొబైల్ పోస్ట్ పెయిడ్, ఇంటర్నెట్ బిల్లులను యాప్ ద్వారా నిమిషాల్లో చెల్లించవచ్చు.

రీచార్జ్ : బీఎస్ఎన్ఎల్ ప్రీపెయిడ్ మొబైల్‌కు యాప్ ద్వారా రీచార్జ్ చేసుకోవచ్చు.

ఫ్యాన్సీ నంబర్ల ఎంపిక : మై బీఎస్ఎన్ఎల్ యాప్ ద్వారా దేశం మొత్తం మీద అందుబాటులో ఉన్న ఫ్యాన్సీ నంబర్లు, వాటి ధరలను తెలుసుకోవచ్చు. తద్వారా మనకు కావాల్సిన నంబరును మనం సొంతం చేసుకోవచ్చు. బీఎస్ఎన్ఎల్ ఫ్యాన్సీ నంబర్‌ను ఎంపిక చేసుకొని మన మొబైల్ నంబర్ ఇస్తే ఎస్ఎంఎస్ ద్వారా పిన్ నంబరు వస్తుంది. ఆ నంబరు మనకు 40 గంటల పాటు రిజర్వు చేసి ఉంచుతారు. ఆ లోగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి వెళ్లి నంబరును సొంతం చేసుకోవచ్చు.

యూసేజ్ రిపోర్ట్..: యాప్‌లో మన ల్యాండ్ లైన్, బ్రాండ్ బ్యాండ్, మొబైల్ సీడీఎంఎకు చెందిన ప్రతి రోజు వినియోగాన్ని పొందవవచ్చు.

హిస్టరీ..: బీఎస్ఎన్ఎల్ ల్యాండ్ ఫోన్, మొబైల్ ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్ బ్రాండ్ బ్యాండ్‌కు సంబంధించిన హిస్టరీని యాప్‌లోని హిస్టరీ ఆప్షన్ ద్వారా తెలుసుకోవచ్చు.

స్పెషల్ ఆఫర్లు..: బీఎస్ఎన్ఎల్‌కు చెందిన ప్రత్యేక ఆఫర్ల వివరాలను యాప్‌తో పొందవచ్చు.

ఫిర్యాదులు..

బీఎస్ఎన్ఎల్ సేవలకు సంబంధించి ఫిర్యాదులను వినియోగదారులు యాప్‌లోని కంప్లయింట్ అనే ఆప్షన్ ద్వారా ఉన్నతాధికారులకు తెలియజేయవచ్చు. తద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు.

- కొత్త ల్యాండ్ లైన్, ఇంటర్నెట్ కనెక్షన్ యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు.

ప్రైవేట్ టెలికమ్యూనికేషన్లకు దీటుగా సేవలు



ప్రైవేట్ టెలి కమ్యూనికేషన్లకు దీటుగా బీఎస్ఎన్ఎల్ సేవలు అందిస్తోంది. కొత్తగా అందుబాటులోకి తెచ్చిన 4జీ నెట్ వర్క్ సేవలను, మై బీఎస్ఎన్ఎల్ యాప్ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలి.

– పి. ముజీబ్ పాషా, జనరల్ మేనేజర్, బీఎస్ఎన్ఎల్, వైఎస్ఆర్ జిల్లా.

తప్పుడు పత్రాలతో భూ ఆక్రమణకు యత్నం


వివాదాస్పద భూమిలో ఉన్న సజ్జ, సన్ననిమ్మ చెట్లను చూపుతున్న బాధితులు

బ్రహ్మంగారిమఠం : మైదుకూరు ఎమ్మెల్యే అండతో తప్పుడు పత్రాలు సృష్టించి టీడీపీ వర్గీయులు భూ ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని మండలంలోని రేకలకుంట పంచాయతీ బాగాదిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కంచంరెడ్డి నారాయణరెడ్డి, బాలిరెడ్డి, సావిత్రమ్మ ఆరోపించారు. శనివారం వారు విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేకలకుంట పొలం సర్వే నంబర్లు 332లో 7.52 ఎకరాలు, 301లో 2.50 ఎకరాలు, 366లో 1ఎకరా, 302లో 1.50 ఎకరాల భూమి ఉంది. అందులో ఆర్ఎస్సార్, ఆర్‌హెచ్‌లో కంచంరెడ్డి కుటుంబీకులకు, పడిగపాటి కుటుంబీకులకు సమాన భాగాలతో ఇరువర్గాలకు భూమి ఉన్నట్లు చూపిస్తోంది, అయితే మొత్తం భూమి తమకు చెందుతుందని పడిగపాటి పుల్లారెడ్డి ఆయన సోదరులు తప్పుడు పత్రాలు తయారు చేయించి బద్వేల్ కోర్టును ఆశ్రయించారు. తప్పుడు పత్రాలతో భూమిని చూపించడంతో కోర్టు ఆదేశాల ప్రకారం కంచంరెడ్డి కుటుంబీకులకు నోటీసులు అందాయి. దీంతో వీరు కూడా కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం కోర్టులో ఉండగానే ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చెప్పాడని పడిగపాటి కుటుంబీకులు దాదాపు 8 ఎకరాలలో గతనెల 7వ తేదీన సన్ననిమ్మ చెట్లు నాటారు. దీన్ని అడ్డుకునేందుకు వెళ్లిన మహిళలపై పడిగపాటి పుల్లారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు దాడికి పాల్పడ్డారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళిక

- కీలక రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- జాయింట్ కలెక్టర్ అదితిసింగ్


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికను రూపొందించుకుని, వాటి లక్ష్యాలను సాధించడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో విజన్ ప్లాన్ రూపకల్పనపై జిల్లా అధికారులతో నిర్వహించిన వర్క్‌షాపులో జేసీ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజన్ ఆంధ్ర 2047 యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రానున్న ఐదు సంవత్సరాలలో జిల్లాను అభివృద్ధి చేసే విధంగా ఆయా శాఖలు ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని శాఖలు లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని అమలు చేయడానికి యాక్షన్ ప్లాన్ రూపొందించి సెప్టెంబర్ 15న సమర్పించాలన్నారు. పేదరిక నిర్మూలన, సోషల్ అండ్ ఫిజికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్, జీవన ప్రమాణాలు పెంపు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఆర్థికాభివృద్ధి రూ.59,472 కోట్ల నుంచి రూ.1,19,620 కోట్ల మేరకు పెరిగేలా అభివృద్ధి వ్యూహాలను రచించాలన్నారు. అలాగే తలసరి ఆదాయం రూ.2,40447 నుంచి రూ.4,83,624కు పెంచేలా కీలకమైన శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయ రంగంలో 34.64 శాతం, పారిశ్రామిక రంగంలో 26.73 శాతం, సేవారంగంలో 38.63 శాతం వాటా ఉందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం స్థూల రాష్ట్ర ఆదాయంలో జిల్లా సుమారు నాలుగు శాతం సహకారం అందించిందని, భవిష్యత్తులో ఐదు శాతం అంతకంటే ఎక్కువ సహకారం అందించేందుకు ప్రతి శాఖ కృషి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతం అయినందున జిల్లాలో రైతులు పండించే పంటలను మార్కెటింగ్ చేసే అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో అరటి పంట ఉత్పత్తి ఎక్కువగా ఉన్నందు వలన వాటిని జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేసి ఆదాయం పెంచే విధంగా ఆలోచించాలన్నారు. పశుసంవర్ధక శాఖ సంబంధించి పాడి పరిశ్రమ అభివృద్ధి, పాల ఉత్పత్తుల తయారీ, పొట్టేళ్ల పెంపకం వంటి అంశాలపై దృష్టి నిలపాలని ఆదేశించారు. పారిశ్రామిక రంగంలో అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు యాక్షన్ ప్లాన్ రెడీ చేయాలన్నారు. గండికోట, సిద్దవటం కోట, ఒంటిమిట్ట, పుష్పగిరి వంటి చారిత్రాత్మక పర్యాటక ప్రాంతాలలో మరిన్ని మౌలిక వసతులు కల్పించి ఆదాయ వనరులు సృష్టించాలన్నారు. అంతకుముందు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ కుమార్ విజన్ ఆంధ్ర 2047 ప్రణాళిక లక్ష్యాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ వెంకట్రావుతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోదాము యజమాని రూ.4.2 కోట్లకు ఐపీ


శ్రీగణేష్ గోదాము వద్ద రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

జమ్మలమడుగు/పెద్దముడియం : పెద్దముడియం మండలం పెద్దపసుపల గ్రామంలోని శ్రీ గణేష్ ఫార్మర్ వేర్ హౌస్ యజమానుల్లో ఒకరైన రామస్వామి అలియాస్ చంటి రూ.4.2 కోట్లకు ఐపీ దాఖలు చేశాడు. శుక్రవారం చాలా మంది రుణ దాతలకు నోటీసులు అందాయి. దీంతో శనివారం రైతులు శ్రీగణేష్ ఫార్మర్ వేర్‌హౌస్ వద్దకు వచ్చి తమ సరుకులు ఉన్నాయో లేదో అంటూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. గతంలో తాడిపత్రి రహదారిలో ఉన్న ఓ గోదాము యజమాని ఐపీ పెట్టి గోదాముల్లో ఉన్న సరుకును చాలా వరకు రాత్రికి రాత్రే మాయం చేశారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉంటుందేమోననే ఆందోళనలో రైతులు ఉన్నారు. గోదాములో ఉన్న సరుకులను ఎవ్వరూ తరలించుకుపోకుండా గోదాముకు సెక్యూరిటీ కల్పించాలని సీఐ గోపాలరెడ్డి, ఎస్ఐ సుబ్బారావును కోరారు.

భాగస్వాములతో చర్చించిన పోలీసులు

గణేష్ ఫార్మర్ వేర్‌హౌస్‌కు నలుగురు యజమానులు. అయితే గోదాము వ్యవహారాలను చూసే బాధ్యతలు రామస్వామికి అప్పగించారు. దీంతో పోలీసులు మిగిలిన భాగస్వాములతో చర్చించారు. రైతులకు సంబంధించిన ఒక్క బస్తా కూడా బయటికి వెళ్లనివ్వం, రైతులు తమ సరుకులు కావాలని వస్తే వారికి ఆదివారం రోజున వారి సరుకులను వారికి ఇచ్చేస్తాం అని భాగస్వామి క్రిష్ణమూర్తి వివరించారు.

రైతులకు అన్యాయం జరగనివ్వం

గోదాములో రైతులు దాచిన ధాన్యాన్ని వారికి కచ్చితంగా అందే విధంగా చూస్తాం. రైతులకు ఎలాంటి అన్యాయం జరగనివ్వం. ఇప్పటికే ఐపీ దాఖలు చేసిన రామస్వామి స్థానికంగా లేకపోవడంతో మిగతా ముగ్గురు భాగస్వాములను పిలిపించి మాట్లాడాము. ప్రస్తుతం ఉన్న సరుకును రైతులకు ఎత్తించి రైతుల ఫొటో తీసుకుంటాం. ఒక్క బస్తా కూడా తక్కువ లేకుండా రైతులకు న్యాయం చేస్తాం.

– సుబ్బారావు, ఎస్ఐ,పెద్దముడియం.

తుది దశకు చేరుకున్న అండర్-19 టోర్నీ


వరుణ్‌సాత్విక్, కృష్ణా (106 పరుగులు)


ప్రణవ్‌కుమార్‌రెడ్డి, కడప (87 పరుగులు)


లోహిత్ లక్ష్మీనారాయణ, చిత్తూరు (67 పరుగులు)


రాజేష్, కృష్ణా, 4 వికెట్లు, 81 పరుగులు


యువన్, విశాఖ, 4 వికెట్లు


పూర్ణ, శ్రీకాకుళం, 4 వికెట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ చివరి దశకు చేరుకుంది. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో శనివారం నిర్వహించిన మ్యాచ్‌లో కడప, విశాఖపట్నం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 66.1 ఓవర్లలో 206 పరుగుల వద్ద కడప జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని ప్రణవ్‌కుమార్‌రెడ్డి 87 పరుగులు, ఆర్థిత్‌కుమార్‌రెడ్డి 37 పరుగులు చేశారు. విశాఖ బౌలర్లు యువన్ 4, రోహిత్ 2, రచిత్ 2 వికెట్లు చొప్పున తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన విశాఖ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 20 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 72 పరుగులు చేసింది. జట్టులోని ఈశ్వర్ రిత్విక్ 61 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, శ్రీకాకుళం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 70.3 ఓవర్లలో 289 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని లోహిత్ లక్ష్మీనారాణ 67, చరణ్‌జీత్ 58 పరుగులు చేశారు. శ్రీకాకుళం బౌలర్లు పూర్ణ 4, జన్నారావు 3 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 17 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 79 పరుగులు చేసింది. జట్టులోని సుశాంత్ 38 పరుగులు, థామస్ రామ్‌కుమార్ 36 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు, కృష్ణా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 43.3 ఓవర్లలో 109 పరుగులకే నెల్లూరు జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని రోహిత్ 27 పరుగులు, హమీద్ 20 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్లు రాజేష్ 4, సాయిప్రకాష్ 2, గీత్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 44 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. జట్టులోని టి. వరుణ్ సాత్విక్ 108 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లతో 106 పరుగులు చేశాడు. ఈయనకు జతగా రాజేష్ 81 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. నెల్లూరు బౌలర్ హమీద్ 2 వికెట్లు తీశాడు. కాగా తొలిరోజు ఆట ముగిసే సమయానికి కృష్ణా జట్టుకు 112 పరుగుల ఆధిక్యం లభించింది.

గంజాయి కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

మూడు కిలోల గంజాయి స్వాధీనం


గంజాయి కేసులో అరెస్టయిన వారి వివరాలను తెలియజేస్తున్న కడప చిన్నచౌక్ ఇన్‌చార్జి సీఐ

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పర్యవేక్షణలో డిస్ట్రిక్ట్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ (డి.ఎన్.సి.సి) ఆధ్వర్యంలో గంజాయి విక్రయాలపై దాడులు నిర్వహిస్తున్నారు. కడప నగరంలో శనివారం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కడప ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్.సుధాకర్ పర్యవేక్షణలో డిస్ట్రిక్ట్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్, చిన్నచౌక్ ఇన్‌చార్జి సీఐ వి. సీతారామిరెడ్డి, ఎస్.ఐ ఎన్. రాజరాజేశ్వరరెడ్డి గంజాయి విక్రయదారులను ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరిని చలమారెడ్డిపల్లె క్రాస్ రోడ్‌లో అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మూడు కిలోల గంజాయి, సెల్‌ఫోన్, రూ. 6500 నగదును స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి నుంచి కొనుగోలు చేసి తీసుకుని వచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

నలుగురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు


ఎర్రచందనం స్మగ్లర్లతో అటవీశాఖ అధికారులు

కడప అర్బన్ : కడప అటవీశాఖ పరిధిలోని లంకమల్ల రిజర్వ్ ఫారెస్ట్ ఖాజీపేట సెక్షన్ బయనపల్లి బీట్, కొండపేట కేసీ కెనాల్ ప్రదేశం వద్ద ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న నలుగురు నిందితులను శనివారం అరెస్టు చేసినట్లు కడప స్క్వాడ్ డీఎఫ్ఓ గురుప్రభాకర్ తెలిపారు. వారి వద్ద నుంచి 10 ఎర్రచందనం దుంగలను, అక్రమ రవాణా చేస్తున్న ఏపీ02 ఏబీ2233 గల చవర్లేట్ కారు, పైలట్‌గా వస్తున్న రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నాగపట్నంకు చెందిన పత్తూరు నాగభూషణం, కె. సుంకేసులకు చెందిన గౌకన్న శ్రీనివాసులరెడ్డి, వేంపల్లి కాపువీధికి చెందిన దుంపల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కుప్పాలపల్లికి చెందిన కుడమల శ్రీనివాసరెడ్డి అనే నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న నిఖిల్‌కుమార్ అనే స్మగ్లర్ ఆచూకీ కోసం స్క్వాడ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అటవీక్షేత్ర అధికారి నయీం అలీ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు టి. నాగరాజు, ఎస్. ఖాజారహమతుల్లా, ఎస్. రవిచంద్ర, బీట్ ఆఫీసర్లు శోభారాణి, వెంకటేశు, బాలచెన్నయ్య, లింగనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ రేపిన ఎస్ఎంసీ ఎన్నిక

- కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్ గేటు వద్ద మోహరించిన టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు
- లోపలికి ప్రవేశించేందుకు యత్నించిన టీడీపీ నాయకులు
- అభ్యంతరం చెప్పిన వైఎస్సార్‌సీపీ నాయకులు.. అడ్డుకున్న పోలీసులు


మున్సిపల్ హైస్కూల్ మెయిన్ వద్ద వాగ్వాదం చేస్తున్న టీడీపీ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో శనివారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక (ఎస్ఎంసీ) ఉత్కంఠ రేపింది. పాఠశాల ప్రారంభంకాక ముందే టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కడికి చేరుకున్నారు. ఎస్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను తప్ప మిగతా ఎవరిని కూడా పాఠశాలలోకి అనుమతించలేదు. ఈ నేపథ్యంలో పాఠశాల లోపలికి ప్రవేశించేందుకు టీడీపీ నాయకులు చేసిన ప్రయత్నాలను వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య ఒక దశలో వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. ఈ దశలో టీడీపీ నాయకులు తిరిగి పాఠశాలలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో చేసేదేమీలేక వారు మిన్నకుండిపోయారు. అయితే ఎన్నికల ప్రక్రియ మధ్యాహ్నం వరకు ఉత్కంఠ రేపింది.

కోరం లేక ఆగిన ఎస్ఎంసీ ఎన్నిక ప్రక్రియ..

మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు 1338 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలంటే ప్రతి తరగతిలో విద్యార్థుల సంఖ్యలో 50 శాతం మంది అంటే 670 మంది విద్యార్థుల తల్లిదండ్రులు హాజరైతేనే ఈ ప్రక్రియ జరుగుతుంది. కానీ ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించి తరగతుల వారీగా 670 మందికిగాను కేవలం 302 మంది మాత్రమే తల్లిదండ్రులు హాజరయ్యారు. దీంతో చేసేదేమీ లేక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి ఎన్నికల ప్రక్రియను వాయిదా వేశారు.

పాత కమిటీనే కొనసాగించాలని డిమాండ్..

మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ఈ నెల 8వ తేదీన ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఇందులో 15 మంది డైరెక్టర్లను ఎన్నుకుని వారిలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా కూడా ఎన్నుకున్నారు. అంతా సజావుగా జరిగి పోయింది. ఇంతటితో ఆ ప్రక్రియ పూర్తయింది. అయితే ఈ నెల 12వ తేదీన కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియ అక్రమంగా జరిగిందని ఈ కమిటీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి డైరెక్టర్‌గా ఉన్నారని తనకు ఫిర్యాదు అందిందన్నారు. ఈ మేరకు ఎన్నికను అధికారులు రద్దు చేశారు. అయితే తాజాగా శనివారం ఇటీవలే ఎన్నికైన పాత కమిటీ పాఠశాలకు వచ్చి అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి సంబంధించిన డైరెక్టర్ పదవిని మాత్రమే రద్దు చేసి దానికి ఒక్కదానికే ఎన్నిక నిర్వహించి పాత కమిటీని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై హెచ్ఎం నాగమణితోపాటు డీఈఓ మర్రెడ్డి అనురాధ, జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటిని కలిసి వినతిపత్రాలు సమర్పిస్తామని ఎస్ఎంసీ సభ్యులు నాగమణి, సరస్వతి, సాకిరా, మహిత, ఓబులేసు తెలిపారు.

ఆగనున్న అభివృద్ధి..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులను కల్పించాలనే లక్ష్యంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో నాడు- నేడు పనులు చేపట్టారు. ఇందులో భాగంగా కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో రూ. 2.35 కోట్లతో 20 అదనపు తరగతి గదులను మంజూరు చేశారు. ఇందులో ఇప్పటి వరకు 12 గదుల నిర్మాణం పూర్తికాగా మరో 8 గదుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి ప్రస్తుతం ఎస్ఎంసీ ఎన్నిక ఆగిపోవడంతో పాఠశాల అభివృద్ధి ఆగిపోతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.